క్లుప్తంగా

పుస్తకాల బహూకరణ

తుంగతుర్తి : మండల కేంద్రంలోని గ్రంథాలయానికి శారదనిధి ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఉచితంగా పుస్తకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేష్, ట్రస్ట్ అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు



గ్రామంలో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గ్రామస్తులు

చివ్వెంల : బి.చందుపట్ల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. గత 5 రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామి వారిని గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. వేద పండితులు మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ ముద్ద వెంకన్న, సర్పంచ్ బోయిళ్ల కృష్ణ, పూజారులు లక్ష్మీనర్సింహాచార్యులు, నాగరాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

తుంగతుర్తి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వాసవీక్లబ్, వనితాగోల్డెన్ బర్డ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ, వనితాక్లబ్‌ల అధ్యక్షులు బండారు వినయ్, బండారు వీణ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నగేష్

నాగారం : సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు, సిబ్బందికి సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించి మాట్లాడారు. మనిషి అకస్మాత్తుగా గుండెపోటుకు గురైనప్పుడు ఆరు నిమిషాల లోపు ఆక్సిజన్ మెదడుకు చేరవేయడం కోసం సీపీఆర్‌ను 30 సార్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఏపీఓ రవి, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

12న సీఓఈ ప్రవేశ పరీక్ష

తుంగతుర్తి : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల/కళాశాలలో ఈ నెల 12న సీఓఈ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దుర్గాభవని శుక్రవారం తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



వెంకన్నను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ వీరప్రసాద్‌యాదవ్, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గొడుగు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సందర్భంగా శుక్రవారం జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఆయనను పరామర్శించారు. పరామర్శించిన వారిలో దేవాలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, కొమారి నాగరాజు, మామిడి సైదులు, కట్టెల నరేష్ ఉన్నారు.

పేదల పక్షపాతి కేసీఆర్

నూతనకల్ : నిరుపేదలందరికీ సీఎం కేసీఆర్ పక్షపాతిగా మారారని బీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు పన్నాల సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సొంత జాగా ఉండి ఇళ్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం ద్వారా రూ. 3లక్షలను ప్రభుత్వం కేటాయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రైతు విభాగం నాయకులు మల్లయ్య, గురులింగం, నాగులు పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతకు పశువులు, గొర్రెలు, మేకలు, డైబజార్‌లకు శుక్రవారం కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ మాట్లాడారు. వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలం పాటను ఈ నెల 14వ తేదీ(మంగళవారం)కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



సంత వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

గడువులోగా పూర్తి చేస్తారా?

- ప్రారంభం కాని ఉపాధి హామీ పనులు
- 20 రోజుల్లో పూర్తి చేయకుంటే నిధులు వెనక్కి
- ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు



చిన సీతారాంతండాలో జీపీ భవన నిర్మాణానికి ముగ్గు పోయిస్తున్న అధికారులు (ఫైల్)

పెన్‌పహాడ్ : ఉపాధి హామీ పథకం కింద మండల అభివృద్ధికి మంజూరైన లక్షల విలువైన పనులు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పూర్తి చేసేందుకు 20 రోజులు మాత్రమే మిగిలాయి. గడువులోగా పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళతాయని అధికారులు పదే పదే చెబుతున్నా పనులు చేయడంలో కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపడం లేదు. రోడ్లు వేయడానికి యంత్రాలు, కూలీలు సరైన సమయంలో దొరకకపోవడం, గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి దాపురించింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు గాను రూ.4కోట్ల 20లక్షల నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో 50పనులను చేపట్టుటకు అధికారులు అంచనా వేసి సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేసినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. 9 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు కూడా మంజూరయ్యాయి.

బిల్లులు రాకపోవడంతోనే అనాసక్తి..

గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు. పెరిగిన సిమెంట్, ఇసుక, ఐరన్ ధరలకు అనుగుణంగా ధరలు పెంచకపోవడం, పాత ధరల ప్రకారం అంచనా వ్యయాన్ని మంజూరు చేయడంతో అనాసక్తి చూపుతున్నారు.

పనులు పూర్తి చేస్తాం



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టి నిర్దిష్ట సమయానికి పనులను పూర్తి చేస్తాం. వర్షాకాలంలో సీసీ రోడ్లు పోయడానికి ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు వాతావరణం అనుకూలించడంతో సమయానుకూలంగా పనులు పూర్తి చేస్తాం.

– బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, అనంతారం

పనులు చేపట్టాలని ఆదేశించాం



పెండింగ్ పనులతో పాటు కొత్త పనులను కూడా గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ప్రజాప్రతినిధులను, కాంట్రాక్టర్లను ఆదేశించాం. పనులు చేపట్టి ప్రభుత్వానికి సహకరించాలి.

– గోపీ, పీఆర్‌ఏఈ, పెన్‌పహాడ్

ప్రజా సమస్యలు విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్‌రెడ్డి

చివ్వెంల : ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం హాత్ సే హాత్ జోడో యాత్ర మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్, బద్యాతండా, పోలిమేర సూర్యాతండా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మండల పరిధిలోని పోలిమేర సూర్యాతండాలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామా ప్రవీణ్, షఫీ ఉల్లా, గండికోట లక్ష్మయ్య, వెలుగు వెంకన్న, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అగ్నిహోమం నిర్వహిస్తున్న పూజారులు

చివ్వెంల : ఉండ్రుగొండ శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వస్తి వాచనం, బాలభోగం, తీర్థ గోష్ఠి, విశ్వక్సేనారాధన, పుణ్యావాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, మత్సంగ్రహణం, అంకురార్పణ, వైనతేయ, ధ్వజారోహణం, చతుస్థానార్చన, గరుడ ముద్ద, అగ్ని ప్రతిష్ఠ, నిత్య హోమం, గరుడ హోమం, నిత్య పూర్ణాహుతి, ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన



గుండెపురిలో రికార్డులను పరిశీలిస్తున్న ఈడీ

తిరుమలగిరి : మండలంలోని గుండెపురి, బండ్లపల్లి గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం చౌక ధరల దుకాణాలను, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి చెట్లను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మంగ, సిబ్బంది ప్రతాప్, రాజు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

పెన్‌పహాడ్ : వివిధ శాఖల అధికారులు తమ విధుల్లో అలసత్వం వహించకుండా సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ రాజేంద్రకుమార్ అన్నారు. అన్ని శాఖల పనితీరు పర్యవేక్షణ కోసం శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్లు, వన నర్సరీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ నకిరేకంటి రవి, ఏపీఓ రవి పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రాజేంద్రకుమార్

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



పెన్‌పహాడ్ : అన్నారంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం



చివ్వెంల : పాశ్యానాయక్ తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పెన్‌పహాడ్ : అంధత్వ నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనియాకుల కోటమ్మ, ధనియాకుల సత్యనారాయణ, మామిడి శోభన్‌బాబు, పరందాములు, వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.

చివ్వెంల : పేదలకు అన్ని రకాల వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాశ్యానాయక్ తండాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు, శస్త్ర చికిత్సకు రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రేణుక, సూపర్‌వైజర్ శిరోమణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గణపారపు మధు, ఏఎన్ఎం మమత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి స్ఫూర్తి సావిత్రీబాయి పూలే



భానుపురి : సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మద్దిరాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూతం రవీందర్



అర్వపల్లిలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు



తిరుమలగిరిలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : యావత్ భారత దేశ మహిళా లోకానికి సావిత్రీబాయి పూలే స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చలమళ్ల నర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్డులో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊర గాయత్రి, భూపతి నారాయణగౌడ్, మారపాక వెంకన్న, కందాల భాస్కర్, అక్కినపల్లి జానయ్య, నిద్ర సంపత్‌నాయుడు, మట్ట రమేష్‌యాదవ్, దాసరి వెంకన్నయాదవ్, దూలం నగేష్, యలగందుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ సంఘం కార్యాలయంలో..

సావిత్రీబాయి పూలే వర్ధంతిని తెలంగాణ బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారాయణ పిళ్లే, బీసీ సంఘం నాయకులు హజారి రంగయ్య, పల్స మల్సూర్, కొండ ఉపేందర్, మహమ్మద్ హబీబుద్దీన్, మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను శుక్రవారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యాలయాలు స్థాపించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తన్నీరు రాంప్రభు, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, కడెం లింగయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పీఆర్ ఏఈ అశోక్, సీనియర్ అసిస్టెంట్ చక్రహరి నర్సింహరాజు, ఏపీఓ చిలుక ఉపేందర్, ఈసీ నగేష్, సీఓలు బి.సుధీర్‌రెడ్డి, రాజన్‌రెడ్డి, సంతోష, రేణుక, బీఆర్ఎస్ నాయకుడు దుబ్బాక ఎల్లంరాజు, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు భూతం రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన నాయకులు పాలబిందెల శ్రీనివాస్, మల్లు ఉపేందర్‌రెడ్డి, భూతం సమ్మయ్య, శిరంశెట్టి రాజు, భూతం ప్రశాంత్, అంగోతు శ్రీను, అశోక్, మహేష్, మధూకర్, చింటు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తాటికొండ సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ప్యాడ్లు పంపిణీ చేస్తున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో టీపీసీసీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, తుంగతుర్తి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ శుక్రవారం 40మంది విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిత్తలూరి రవీందర్, ఉపాధ్యాయులు స్నేహలత, వర్దెల్లి కృష్ణయ్య, కె.సీనయ్య, ఎస్.వెంకన్న, మురళీకృష్ణ, మాధవి, పీఈటీ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని కేజీబీవీలో టెన్త్ విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు జ్ఞానసుందర్ శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పాఠశాల లైబ్రరీకి భారత రాజ్యాంగం, తెలంగాణ రైతు భూమి హక్కుల చట్టం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పీవైఎల్ మహాసభ

అర్వపల్లి : ప్రగతిశీల యువజన సంఘం జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల మహాసభ డి.కొత్తపల్లిలో శనివారం(నేడు) జరుగుతుందని పీవైఎల్ నాయకులు పోలెబోయిన మధూకర్, ఉయ్యాల మహేష్, గణేష్, సతీష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్, ఐఎఫ్‌టీయూ, పీవైఎల్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు యువకులు కదలిరావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురంలో ప్రదర్శన ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారధి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పి.రాము, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

నాగారం : ఫణిగిరిలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం, చక్రస్నానం, అగ్నిహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని రథంలో ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్వామివారికి దూప, దీప, నైవేద్యాలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, అర్చకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

తిరుమలగిరి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, ప్రత్యేక అధికారి కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నూతనకల్ : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం గుండ్లసింగారం కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలకు నీళ్లు పోస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా పట్టణంలోని 28వ వార్డులో మొక్కలకు స్థానిక కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొల్లెద్దు దశరథ, ఇండ్ల సురేష్, మోహినుద్దీన్, మున్సిపల్ డీఈ సత్యారావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ జనార్దన్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ వసుంధర, మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో స్వపరిపాలన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు సుదర్శన్, దుర్గాప్రసాద్‌రెడ్డి, మల్లారెడ్డి, రవికుమార్, మల్లీశ్వరి, గీత, సివి, అనిత, అన్నపూర్ణాచారి, శిరీష, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోటపహాడ్‌లో..

మండల పరిధిలోని కోటపహాడ్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన వేడుకలను శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రమేష్, రాణి పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంఈఓ బోయిని లింగయ్య, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, డైరెక్టర్లు ఎండీ నజీర్, వెంకటగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలోని శ్రీ విద్యా భారతి పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆయుష్మాన్ భారత్‌లో చేరాలి



ఆన్‌లైన్ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : ప్రతి కుటుంబం ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్‌లో చేరి ఐదు లక్షల రూపాయల ఉచిత ఆరోగ్య బీమాను పొందాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పలస మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 30వ వార్డులో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేద, మధ్యతరగతి వర్గాల కష్టాలను గుర్తించి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో పల్స మల్సూర్, సలిగంటి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

మద్దిరాల : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్స్ ఏఎస్ఐ పాండు నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అప్రమత్తత, షీటీమ్స్ గురించి వివరించారు. మానవ అక్రమ రవాణా, మహిళల భద్రత, పిల్లల సంరక్షణ తదితర అంశాలపై కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వెంకన్న, పాఠశాల ఎస్ఓ తేజశ్రీ, సిబ్బంది శివరాం, శ్రీనివాస్, సురేష్ యాదవ్, నారాయణరెడ్డి, యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున, కృష్ణ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నాపురం గుట్టను పరిశీలించిన తహసీల్దార్

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి ఆవాసం చెన్నాపురం గుట్టను శుక్రవారం స్థానిక తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని శాంతినగర్, కాశీతండా గ్రామాలకు చెందిన కాశీవారు(రాయికొట్టేవారు) చెన్నాపురంగుట్ట క్రషరింగ్ లీజును రద్దు చేయాలని ఫిర్యాదు అందిందని ఆయన తెలిపారు. దీంతో గుట్టను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ సాయికృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు సబ్సిడీ

అర్వపల్లి : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు కల్పిస్తుందని ఉద్యానవనశాఖ డివిజన్ అధికారిని స్రవంతి చెప్పారు. కొమ్మాలలో శుక్రవారం ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈపంటసాగుతో కలిగే లాభాలు, రాయితీలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నేరెళ్ల సత్యం, పతాంజలి కంపెనీ ప్రతినిధులు రంగు ముత్యంరాజు, రైతు కోఆర్డినేటర్ ఆర్.వెంకట్‌రెడ్డి, గంగదెరి శ్రీను, సోమిరెడ్డి, ధర్మాజీ, రైతులు పాల్గొన్నారు.